
శ్రీ పద్మపురాణాంతర్గత

శ్రీ దామోదరాష్టకమ్

- భావార్థముతో -

శ్రీరస్తు

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

దామోదరాష్టకమ్

01. నమామీశ్వరం సచ్చిదానందరూపం
లసత్కుండలం గోకులే భ్రాజమానం।
యశోదాభి యోలుఖలాద్ధావమానం
పరామృష్టమత్యంత తో దృత్య గోప్యా॥

శాశ్వతుడు, జ్ఞాన స్వరూపుడు, పరమానంద స్వరూపుడు, సొరచేప ఆకృతిలో వుండి ఊగుతున్న కర్ణ కుండలములు ధరించినవాడు, గోకులంలో అతి సౌందర్యంతో ప్రకాశించేవాడు, తల్లి చిలుకుతున్న వెన్నకుండను పగులగొట్టి, ఉట్టికి కట్టిన వెన్నకుండనుండి వెన్న దొంగిలించుటచే భయపడువాడు, చెక్కరోలునుండి పరుగెత్తువాడు, కానీ యశోదాదేవికి పట్టుబడిన వాడు అగు దేవదేవుడైన దామోదరునికి ప్రణమిల్లుచున్నాను.

02. రుదంతం ముహుర్ నేత్రయుగ్మం మృజంతం
కరాంభోజ యుగ్మేన సాతంకనేత్రం।
ముహుః శ్వాస కంప త్రిరేఖాంకకంఠ-
స్థితగ్రైవం దామోధరం భక్తిబద్ధమ్॥

తల్లి చేతిలోని కర్రను చూసి ఏడుస్తూ తన రెండు కళ్ళను చేతులతో మరల మరల నులుముకుంటున్నవాడు, భయంతో నిండిన నేత్రములు కలవాడు, ఏడ్పుట వలన, వేగంగా ఊపిరి పీల్చుటవలన ఊగుతున్న ముత్యాలహారము కంఠము నందున్నవాడు, తన ఉదరమునకున్న తాడుచేత కాక తన తల్లిప్రేమచేత కట్టబడినవాడు అగు దేవదేవుడైన దామోదరునికి ప్రణమిల్లుచున్నాను.

03. ఇతీదృక్ స్వలీలాభి రానన్ద కుండే
స్వఘోషం నిమజ్జంత మాఖ్యాపయంతం।
తదీయేశిత(షితా)జ్ఞేషు భక్తైర్జితత్వం
పునః ప్రేమతస్తం శతావృత్తి వందే॥

తన బాల్య లీలలచేత గోకులవాసులను పారవశ్యంలో ముంచెత్తినవాడు, గౌరవ ప్రపత్తులు మిశ్రితము కాని, అన్యోన్య పవిత్ర ప్రేమ గాఢంగా గల భక్తులకు, మహోన్నత దివ్య విజ్ఞానముగల భక్తులకు వశమగుదునని అభయ మిచ్చినవాడు అగు దేవదేవుడైన దామోదరునికి మిక్కిలి ప్రేమతో నేను మరల మరల అనేక వందల సార్లు ప్రణమిల్లు చున్నాను.

04. వరం దేవ! మోక్షం న మోక్షావధిం వా
న చాన్యం వృణేహం వరేశాదపీహ।
ఇదం తే వపుర్నాథ గోపాలం బాలం
సదా మే మనస్యా విరాస్తాం కిమన్యైః॥

ఓ దేవా! నువ్వు అన్ని వరములు అనుగ్రహించగలవాడైనప్పటికీ నేను నిరాకార ముక్తిగానీ సర్వోత్తమ శాశ్వత ముక్తిగానీ నవవిధ భక్తి ద్వారా పొందదగు మరెటువంటి వరమును కోరను. ఓ స్వామీ! నేను కేవలం బృందావనంలో నీ బాలగోపాలుని రూపము ఎల్లప్పుడు నా హృదయంలో కొలువై వుండాలని కోరుకొంటున్నాను. ఇంతకంటే యే యితర వరమైననూ నాకేమి ప్రయోజనము?

05. ఇదం తే ముఖాంభోజ మత్యంత నీలై-
ర్వృతం కుంతలైః స్నిగ్ధ-రక్తైశ్చ గోప్యా।

ముహుశ్చుంబితం బింబరక్తాధరం మే
మనస్యావిరాస్తామలం లక్షలాభైః॥

స్వామీ! మెత్తని, నల్లని కురులతో ఒప్పుచున్న నీ ముఖ పద్మమును నీ తల్లి యశోద పదే పదే ముద్దులాడుచున్నది. నీ పెదవులు దొండపండు వలే ఎర్రగా నున్నవి. నీ సుందర ముఖారవింద రూపము నాహృదయంలో నిలిచియుండుగాక! నాకు వేలకు వేల ఇతర వరముల వలన ఉపయోగమేమీ లేదు.

06. నమో దేవ దామోదరానంత విష్ణో
ప్రసీద ప్రభో దుఃఖ జాలాబ్ధిమగ్నం।
కృపాదృష్టివృష్ట్యాతిదీనం బతాను
గృహాణేశ మాం అజ్ఞ మేధ్యక్షిదృశ్యః॥

ఓ దేవాదిదేవా! నేను నీకు ప్రణమిల్లుచున్నాను. ఓ దామోదరా! అనంతా! ఓ విష్ణో! ఓ స్వామీ! నాపై కృప చూపుము. నాపై నీ కృప అనుగ్రహించి సంసార దుఃఖ సాగరములో మునిగిన ఈ మూర్ఖుని దరిజేర్చి నాకు దర్శనమివ్వు.

07. కుబేరాత్మజౌ బద్ధమూర్త్యైవ యద్వత్
త్వయా మోచితౌ భక్తిభాజౌ కృతౌ చ।
తథా ప్రేమభక్తిం స్వకం మే ప్రయచ్ఛ
న మోక్షే గ్రహో మేస్తి దామోదరేహ॥

ఓ దామోదరా! ఏవిధంగానైతే నీవు చెక్కరోటికి కట్టబడిన తర్వాత కుబేరుని పుత్రులైన నలకూబర, మణిగ్రీవులకు ముక్తి కలిగించి మహాభక్తులుగా అనుగ్రహించావో అదే విధంగా నాకు నీ ప్రేమభక్తిని ప్రసాదించు. నేను కేవలం దీనికొరకే పరితపిస్తున్నాను. నాకు మరే రకమైన ముక్తిపైన కోరికలేదు.

08. నమస్తేస్తు దామ్నే స్ఫురద్దీప్తిధామ్నే
త్వదీయోదరాయాథ విశ్వస్య ధామ్నే।
నమో రాధికాయై త్వదీయప్రియాయై
నమోనంతలీలాయ దేవాయ తుభ్యం॥

ఓ దామోదరా! ముందుగా నీ ఉదరమునకు కట్టబడిన త్రాడుకు నేను ప్రణమిల్లుతున్నాను. తరువాత ప్రపంచమంతటికీ నెలవైన నీ ఉదరమునకు ప్రణమిల్లుతున్నాను. నీకు ప్రియాతి ప్రియమైన రాధాదేవికి నేను వినయపూర్వకంగా ప్రణమిల్లుతున్నాను. అనంత లీలలు ప్రదర్శించే దేవాదిదేవుడవైన నీకు నా సమస్త ప్రణామములు అర్పించుచున్నాను.

ఇతి శ్రీమద్పద్మపురాణే శ్రీ దామోదరాష్టకం సంపూర్ణమ్



కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్





Kiron Type Institute


(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)